క్లుప్తంగా

రాస పోలమాంబకు విశేష పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం మల్లెలు, కనకాంబరం, తులసి మాలలతో ఆలయ కమిటీ ప్రతినిధులు అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ అలంకరణకు దిలిమి రాజ్యలక్ష్మి, వెంకటేష్, దుర్గ సహాయ సహకారాలు అందించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక ప్రసంగం రేపు



హెచ్.జి. కలకాంత్ ప్రభు

కొమ్మాది: ఇస్కాన్ వ్యవస్థాపకులు ఆచార్య శ్రీల ప్రభుపాదుల శిష్యుడు, ఆధ్యాత్మిక గురువు హెచ్.జి.కలకాంత్ ప్రభు ఆధ్యాత్మిక ప్రసంగాన్ని గురువారం సాయంత్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ ఓ ప్రకటనలో తెలిపారు. బీచ్‌రోడ్డులోని సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో ఈ ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక అన్వేషణలకు మార్గనిర్దేశం చేస్తున్న ప్రభుజీ హరి నామం యొక్క గొప్పతనాన్ని, శ్రీకృష్ణుని లీలలను ఈ ప్రసంగంలో వివరిస్తారని పేర్కొన్నారు.

కొట్లాటలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన అప్పలరాజు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో సోమవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలివి.. వ్యక్తిగత కక్షల నేపథ్యంలో దేవాడ అప్పల సూరి ఇదే ప్రాంతానికి చెందిన ఎరుసు అప్పలరాజుపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో అప్పలరాజుకు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. సకాలంలో స్థానిక యువకులు అప్పలరాజును ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పీఎం పాలెం: ఐఐఎం కళాశాలలో ఇటీవల నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్ పినాకిల్–2025లో స్థానిక శ్రీనివాసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ చదువుతున్న విద్యార్థులు వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. పికిల్ బాల్‌లో జి.సాయి శశాంక్, ఐపీఎల్ ఆక్షన్ రన్నర్స్ అండ్ థియోఫిలస్ విభాగంలో ఎం లక్ష్మణరావు, ఎం.త్రినాథ్, ఎ.అభిరామ్ విజేతలుగా నిలిచారు. స్నూకర్ రన్నర్‌గా ఎం.అభిషేక్, ఫాషన్ షో రన్నర్‌గా టి.శ్రేయ నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ యు.లారెన్స్, డైరెక్టర్ డాక్టర్ సాయి, అర్చన తదితరులు అభినందించారు.

సాధనతో అంతఃకరణ శుద్ధి సాకారం



పరిపూర్ణానంద స్వామి

మద్దిలపాలెం: మనసుతో సాధన చేస్తే అంతఃకరణ శుద్ధి సాకారమవుతుందని, మనసు బుద్ధి ,చిత్తంతో సాధనకు అనుకూలంగా మార్చుకుంటే మానసిక వికా సం పొందగలమని పరిపూర్ణానంద స్వామిజీ ప్రవచించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నాలుగో రోజు మంగళవారం సాధన రహస్యం అనే అంశంపై ప్రసంగించారు. అహంకారం అనేది వీడితే విజయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వీఎండీఏ అధ్యక్షుడు సత్యనారాయణ రాజు , ప్రధాన కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎక్స్‌రే యూనిట్ కల



ఆస్పత్రిలో ఎక్స్‌రే యంత్రం

ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్‌కు సంబంధించి గత 30 సంవత్సరాలుగా ఎన్నో ప్రకటనలు చేశారు. అవేవీ కార్యరూపం దాల్చలేదు. గత సంవత్సరం ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ అధునాతన ఎక్స్‌రే మెషీన్ ద్వారా ఎక్స్‌రే తీసి, దానిని నిపుణులకు పంపి వారి సలహాలు తీసుకుంటున్నారు. ముందుగా క్షతగాత్రులకు లేదా ఛాతీ, నడుము, కాళ్లు, చేతులకు సంబంధించిన సమస్యలున్న వారికి అవసరం మేరకు రేడియోగ్రాఫర్ ఎక్స్‌రే తీస్తారు. ఇవి ఒక క్యాసెట్‌లో నమోదవుతాయి. వీటిని డిజిటల్ ఎక్స్‌రే క్యాసెట్ రీడర్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉంచుతారు. వాటిని వైద్యనిపుణులు పరిశీలించి, ఏ చికిత్స అందించాలనే రిపోర్ట్‌ను ఇక్కడికి పంపిస్తారు. దానిని అనుసరించి రోగులకు ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. దీంతో రోగులకు బయట ల్యాబ్‌లలో ఎక్స్‌రేలు, వైద్యుల వద్దకు వెళ్లే ఖర్చులు, ఇబ్బందులు తొలగిపోయాయి.

ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్



రక్త పరీక్షలు నిర్వహించే ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్

సీహెచ్‌సీలో చాలా తక్కువ సమయంలో నాణ్యమైన రక్త పరీక్షలు చేయడానికి అత్యంత అధునాతన ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్ యంత్రం ఏర్పాటు చేశారు. దీనిద్వారా లివర్, కిడ్నీ, గుండెకు సంబంధించిన సమస్యలు, లిపిడ్ ప్రొఫైల్, కాల్షియం, కొలెస్ట్రాల్‌తో పాటు అన్ని రకాలైన రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో రక్త నమూనాలను తీసుకున్న తరువాత ఆ ఫలితాలను ఇవ్వడానికి రెండు, మూడు రోజుల సమయం పట్టేది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఎంతో శ్రమకోర్చి, ఖర్చులు పెట్టుకుని మళ్లీ రావలసి వచ్చేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఇందులో ఒకేసారి 200 రక్త నమూనాలను పరీక్షించవచ్చు. అది కూడా కేవలం పది నిమిషాల్లో ఫలితాలు అందిస్తుంది. అందువల్ల రోగులకు సమయం, ఖర్చులు ఆదా అవుతున్నాయి.

అందుబాటులో ఆధునిక వైద్య పరికరాలు



కంప్యూటర్ స్క్రీన్‌పై ఎక్స్‌రేను పరిశీలిస్తున్న వైద్యురాలు

గత ప్రభుత్వంలో ఏర్పాటు | **రోగులకు ఎంతో ఉపయోగం**

భీమునిపట్నం: భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండడంతో రోగులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటోంది. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు నాలుగు వార్డులు కలిగిన జోన్ పరిధికి సంబంధించి 30 పడకలతో ఉన్న ఇదే ప్రధాన ఆస్పత్రి. గత ప్రభుత్వ హయాంలో రూ. 3 కోట్లతో ఆస్పత్రిని ఆధునికీకరించడంతో పాటు, వైద్యులను కూడా అందుబాటులోకి తీసుకురావడంతో ప్రతి రోజు వందలాదిమంది రోగులు ఇక్కడ సేవలు పొందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు

గతంలో సరైన వైద్య పరికరాలు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవసరమైన పరీక్షలు చేయించుకునేందుకు వేలాది రూపాయలు వెచ్చించవలసి ఉండటంతో రోగులకు ఎంతో కష్టంగా ఉండేది. కాగా అన్ని వైద్య సదుపాయాలు పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలను తీసుకున్నారు. అందులో భాగంగా లక్షలాది రూపాయల విలువ గల అధునాతన వైద్య యంత్రాలను మంజూరు చేయడంతో, అవి ఏర్పాటై రోగులకు వరంగా మారింది. అంతేగాక గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, చిల్డ్రన్ స్పెషలిస్ట్, అనస్థిటిస్ట్, డెంటిస్ట్ తదితర వైద్యులు కూడా అందుబాటులోకి రావడంతో రోజూ 200కు పైగా ఓపీ నమోదవుతోంది.

బ్లడ్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్



రక్తం ప్యాకెట్లు భద్రపరిచే ఫ్రీజర్

గతంలో ఇక్కడ రక్తాన్ని నిల్వ చేసుకునే బ్లడ్‌బ్యాంక్ సదుపాయం లేదు. దీంతో ప్రమాదాల్లో గాయపడిన వారికి, ఆపరేషన్ అవసరమైన వారికి అత్యవసరంగా రక్తం కావాలంటే విశాఖ వెళ్లవలసి వచ్చేది. అత్యవసర పరిస్థితుల్లో కొందరికి సమయానికి రక్తం అందక విశాఖ వెళ్లేలోపు మరణించిన సంఘటనలూ ఉన్నాయి. ఇది ఎంతో ప్రధానమైన సమస్య కావడంతో ఇక్కడ బ్లడ్‌బ్యాంక్ రిఫ్రిజిరేటర్ ఏర్పాటుచేశారు. దీంతో అన్ని గ్రూపులకు సంబంధించిన బ్లడ్ ప్యాకెట్లను విశాఖ విక్టోరియా జనరల్ ఆస్పత్రి నుంచి ఇక్కడికి పంపిస్తుండగా, ఫ్రీజర్‌లో వాటిని భద్రపరుస్తున్నారు. అవసరమైన వారికి వాటిని వినియోగిస్తున్నారు. దీంతో అత్యవసర వేళల్లో రోగులకు, వారి బంధువులకు ఎంతో సౌకర్యంగా ఉంటోంది.

చాలా సదుపాయంగా ఉంది



ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేశాక చాలా సౌకర్యంగా ఉంది. గతంలో ఎక్స్‌రే తీయించాలంటే తగరపువలసలోని ప్రైవేట్ ల్యాబ్ వద్దకు వెళ్లవలసి వచ్చేది. ఆరోగ్యం బాగా లేక వచ్చి, మళ్లీ అక్కడికి పేషెంట్‌ను తీసుకువెళ్లాలంటే ఎంతో కష్టమయ్యేది. డబ్బులు కూడా బాగా ఖర్చయ్యేవి. ఇప్పుడు ఇక్కడే ఎక్స్‌రే ఏర్పాటు చేయడంతో చాలా సదుపాయంగా ఉంది. శ్రమ, ఖర్చు కూడా తగ్గాయి.

– శివ, మంగమారిపేట

రక్త పరీక్షలు చాలా సులువయ్యాయి



గతంలో రక్తపరీక్షలు చేయించుకున్నాక ఫలితాల కోసం సమయం ఎక్కువ పట్టేది. దాంతో మళ్లీ రావలసి వచ్చేది. ఇప్పుడు అటువంటి ఇబ్బందులు లేకుండా కొద్ది సేపటికే ఫలితాన్ని ఇచ్చేస్తున్నారు. డాక్టర్ వెంటనే చూసి, మందులు రాస్తున్నారు. ఎంతో సమయం, డబ్బు ఆదా అవుతోంది.

– పల్లా లక్ష్మి, టి.నగరపాలెం

రక్తం అందుబాటులో ఉంటోంది



ఇక్కడ ప్రసవాలతో పాటు ఇతర అవసరాలకు రక్తం కావాలంటే విశాఖ వెళ్లవలసి వచ్చేది. తప్పనిసరి అయితే కేజీహెచ్‌కు గాని, ప్రైవేటు ఆస్పత్రులకు గానీ పరుగులు పెట్టాల్సి వచ్చేది. దీనికి చాలా ఎక్కువ ఖర్చయ్యేది. మా దగ్గర బంధువులే ఈ సమస్యను ఎదుర్కొన్నారు. కానీ, ఇప్పుడు నిత్యం రక్తం అందుబాటులో ఉంటోంది. అత్యవసర వేళ ఇబ్బందులు తగ్గాయి.

– రాంభుక్త దేవి, భీమిలి

గ్రావెల్ తరలింపు వెనుక టీడీపీ హస్తం..!

తగరపువలస: ఇటీవల పద్మనాభం మండలం గంధవరం నుంచి నిరాటంకంగా సాగుతున్న గ్రావెల్ దందా వెనుక అక్కడి టీడీపీ నాయకుని హస్తం ఉన్నట్టు స్పష్టమవుతోంది. పగలనక, రాత్రనక లారీలు, ట్రాక్టర్లతో రవాణా అవుతున్న గ్రావెల్‌ను రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోయినా, పోలీసులకు మాత్రం రూ.లక్షలు కురిపిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం వరుసగా వస్తున్న ఫిర్యాదులకు లోబడి పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినా మండలానికి చెందిన టీడీపీ నాయకుల నుంచి వదిలేయాలని ఒత్తిళ్లు రావడంతో పాటు.. దందాను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గ్రావెల్ దందాను అరికట్టి అక్రమ రవాణా చేస్తున్న వారిపై నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేయాలని మండలానికి చెందిన పలువురు డిమాండ్ చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



మధురవాడలో ప్రచారం చేస్తున్న సభ్యులు

మధురవాడ: పరమాత్ముడైన శ్రీకృష్ణుడి శిష్యుడైన అర్జునుడి (ఫల్గుణుడి) పేరు మీద వచ్చిన ఫాల్గుణ మాసంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఫాల్గుణ మాసం ప్రారంభం సందర్భంగా మధురవాడ నగరంపాలెం పరిసర ప్రాంతాలలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. ఫాల్గుణ మాసం, హోలి పౌర్ణమి సందర్భంగా మన పండుగలపై కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పుష్కరరావు, విజయ, అరుణ్‌కుమార్, గణేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు సత్కారం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేట, కొత్తపేట గ్రామ దేవత కొత్తమ్మతల్లి ఆలయంలో ప్రతివారం జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో సహకరిస్తున్న దాతలను ఆలయ కమిటీ మంగళవారం సత్కరించింది. దాతలకు అమ్మవారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రంగూరి సీతారామదొర, త్రినాథరెడ్డి, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి విశాఖపై చిన్నచూపు



వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస : కూటమి ప్రభుత్వ అసమర్థపాలన వల్లే రుషికొండకు బ్లూ ఫ్లాగ్ బీచ్ గుర్తింపు రద్దయిందని వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. విశాఖ నగరాన్ని కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించడం, విశాఖ పర్యాటకంగా అభివృద్ధి చెందడం కూటమి ప్రభుత్వానికి మొదటి నుంచీ ఇష్టం లేదన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పర్యాటకంగా దేశంలోనే టాప్ నగరాలతో పోటీ పడుతున్న విశాఖలో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా రుషికొండ బీచ్‌ను రూ.7.35 కోట్లతో అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. ఇప్పుడు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు రద్దు విషయంలో కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి అధికారులను బలిపశువులను చేసిందన్నారు. తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి అధికారులను దోషులుగా నిలబెట్టిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు.

విశాఖపై విషం : విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తున్నట్లు ప్రకటించిన నాటి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలు విశాఖపై విషం చిమ్ముతూనే ఉన్నాయన్నారు. విశాఖలో అభివృద్ధి, పర్యాటక ప్రాజెక్టులు, కీలక నిర్మాణాలకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేస్తూ వచ్చారన్నారు.

ఏడాది కాకముందే వెలవెల : విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని బీరాలు పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు రుషికొండ బీచ్‌కు ఉన్న గుర్తింపును కూడా కాపాడలేకపోయారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రుషికొండ బీచ్ ప్రపంచ బీచ్‌గా రూపొంది నాలుగేళ్ల పాటు ఇక్కడ బ్లూ ఫ్లాగ్ రెపరెపలాడిందన్నారు. ప్రపంచ పర్యాటకులతో కళకళలాడవలసిన రుషికొండ బీచ్ కూటమి పాలన ఏడాది పూర్తి కాకముందే వెలవెలపోయిందన్నారు. నిత్యం పర్యాటకులతో సందడిగా ఉండే రుషికొండ బీచ్‌లో కనీస వసతులు కొరవడటంతో వీధి కుక్కలకు నిలయంగా మారిందన్నారు. ప్రైవేట్ నిర్వాహకులతో కూటమి ప్రభుత్వం కుమ్మక్కై నిర్వహణ సొమ్మును పక్కదారి పట్టించి, ప్రపంచ స్థాయిలో రుషికొండ బీచ్‌ను బజారుకు ఈడ్చారన్నారు. ఇప్పటికైనా ఉత్తరాంధ్రపై విషం చిమ్మడం మానుకుని వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి కొనసాగింపుపై దృష్టి సారించాలన్నారు. లేకుంటే ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో జరిగిన పరాభవం కూటమి ప్రభుత్వానికి మరోసారి తప్పదని హెచ్చరించారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఆర్డీవో సంగీత్ మాథూర్



భద్రతా పరికరాలు పరిశీలిస్తున్న భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్

తగరపువలస: పరిశ్రమలలోని పని ప్రదేశంలో యాజమాన్యంతో పాటు ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటించాలని భీమిలి ఆర్డీవో కనకల సంగీత్ మాథూర్ అన్నారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో మంగళవారం జరిగిన 54వ జాతీయ భద్రత మాసోత్సవాలలో పాల్గొన్న ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. నిరంతరం అప్రమత్తంగా ఉండటం వలన భద్రతపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలు సమకూర్చుకోవడం ద్వారా కొంతవరకు భద్రతకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు భద్రతపై వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎస్.దేవేందరరావు, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, ఈహెచ్ఎస్ జి.ఎం.కె.సుబ్బారావు, భద్రత అధికారి ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్



హాజరైన అధికారులు, సిబ్బంది

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధ నేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహిస్తానని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్లు, ఇతర విభాగ అధిపతులతో ఆయన సమావేశమయ్యారు. పరిపాలన విభాగాలలో పని చేస్తున్న సిబ్బంది, వారి విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను పరిరక్షిస్తూ, మరింత పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలని సూచించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు

ఏయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను వర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్లు ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వందేళ్ల ఉత్సవాల్లో భాగస్వాములను చేయండి

ఏయూ వందేళ్ల ఉత్సవాల్లో తమను భాగస్వాములను చేయాలని వర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు వీసీ రాజశేఖర్‌ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శిరీష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ గుడ్లు పక్కదారి



గొల్లలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్ల కోసం చూస్తున్న పిల్లలు

కొమ్మాది: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించాల్సిన గుడ్లు పక్కదారి పడుతున్నాయి. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి గొల్లలపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రోజు తప్పించి రోజు మాత్రమే కోడిగుడ్లు పెడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ అంగన్‌వాడీ కేంద్రంలో పదిమంది చిన్నారులున్నారు. వారికి ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు కోడిగుడ్లు, మధ్యాహ్నం 12 గంటలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి. కానీ ఈ అంగన్‌వాడీ కేంద్రంలో నిబంధనలను సరిగ్గా పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పిల్లల తల్లిదండ్రులు కేంద్రానికి వెళ్లి, కోడిగుడ్లు పెట్టారా అని పిల్లలను ప్రశ్నించగా వారు లేదని చెప్పడంతో సిబ్బందిని నిలదీశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మిగిలిన గుడ్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తల్లిదండ్రులు ప్రశ్నించడంతో ఆయా సుమారు 11.30 గంటల సమయంలో పిల్లలకు కోడిగుడ్లు ఉడికించి పెట్టారు.

చర్యలు తీసుకుంటాం

గొల్లలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు గుడ్లు అందజేయకపోవడంపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రతీ కేంద్రంలో రోజూ కోడిగుడ్లు, మెనూ ప్రకారం భోజనం పెట్టాలి. సమయానికి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయా ఉండాలి. సిబ్బంది తప్పు చేస్తే క్షమించేది లేదు.

– శ్రీదేవి, ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐసీడీఎస్

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్యులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి మండల అధ్యక్షుడు శ్రీను

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేటలో బెస్ట్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత రక్తదాన, వైద్య శిబిరాలు జరిగాయి. ట్రస్ట్ చైర్మన్ పల్ల సూరిబాబు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో 180 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలతో పాటు ఉచిత వైద్యసేవలు అందించిన సిబ్బందిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, వైద్యులు కుప్పిలి సురేష్‌బాబు, ఐ.ఉదయభాస్కర్, స్థానిక పెద్దలు తుపాకుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

‘హనుమ ఒక్కరుంటే చాలు..’



సంపూర్ణ శ్రీరామాయణంపై ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: హనుమ ఒక్కరు ప్రాణాలతో ఉంటే, తక్కిన వారందరూ ఎంత ఆపదలో ఉన్నా కాపాడబడతారని జాంబవంతుడు పేర్కొన్నారని బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు తెలియజేశారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచనాల్లో భాగంగా యుద్ధకాండలో పలు అంశాలను ఆయన వివరించారు. రామలక్ష్మణులతో కూడిన వానర సైన్యానికి, ఇంద్రజిత్తుకు మధ్య జరిగిన యుద్ధం గురించి తెలిపారు. ఇంద్రజిత్తు మేఘాల చాటు నుంచి ఎవరికీ కనిపించకుండా బ్రహ్మాస్త్ర ప్రయోగంతో కొన్ని లక్షల మంది వానరులను సంహరించడం.. ప్రాణములు విడిచిపెట్టిన, ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న అనేక మంది వానరులను సంజీవని పర్వతమును తీసుకువచ్చి హనుమ కాపాడటం, ఇంద్రజిత్తును నిరోధించడానికి లక్ష్మణుడు ఉద్యుక్తుడైన సంఘటనలను చాగంటి వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇదా పారిశుధ్య నిర్వహణ తీరు?



అన్నవరం గ్రామ సచివాలయం ముందు నాచుకట్టి నీరు నిల్వ ఉన్న వీధి కుళాయి

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో పారిశుధ్యం పడకేసిందనడానికి ఈ వీధి కుళాయే సాక్ష్యం. అన్నవరం గ్రామ సచివాలయం ముందే వీధి కుళాయి వద్ద రోజుల తరబడి నీరు నిలిచి నాచుకట్టిపోయింది. ఈ మురుగులో నుంచే స్థానికులు నీళ్లు పట్టుకుంటున్నారు. పారిశుధ్య పరిస్థితి ఇంతలా దిగజారుతున్నా సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. స్థానికులకు స్వపరిపాలన అందించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాలను అందుబాటులోకి తీసుకువస్తే, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థలో జవాబుదారీతనం లోపించిందని పలువురు ఆరోపిస్తున్నారు. సచివాలయం ఉన్న గ్రామాలలోనే కనీస వసతులు సమకూరడం లేదని వాపోతున్నారు.